నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 15 ఫిబ్రవరి 2025 | SANGAREDDY

సాగునీటి కోసం మరోపోరాటం

- సంగమేశ్వర,బసవేశ్వర ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది

హైదరాబాద్‌లో ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో సమావేశమైన మాజీ మంత్రి హరీశ్‌రావు

- త్వరలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు
- రెండు ఎత్తిపోతలు పూర్తిచేసే వరకు కాంగ్రెస్ సర్కారును వదలం
- కేసీఆర్ ఆకాంక్ష నెరవేరే వరకు ఆయకట్టు పరిధిలో నిరసనలు
- సంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలతో మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- పోరాట కార్యాచరణపై చర్చ

సంగారెడ్డి, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరందించే సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆకాంక్షించిన విధంగా సంగారెడ్డి జిల్లాలోని సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందే వరకు బీఆర్ఎస్ పోరాటం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో హరీశ్‌రావు సమావేశం అయ్యారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పనులు ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహం, సాగునీటి పోరాట కార్యాచరణపై చర్చించారు. సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. 21 ఫిబ్రవరి, 2022న సీఎం హోదాలో కేసీఆర్ నారాయణఖేడ్ పట్టణంలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి పనులు సైతం ప్రారంభించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పట్టించుకోవటంలేదన్నారు. ప్రభుత్వ చర్యలతో నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గ రైతుల సాగునీటి కల కలగానే మిగిలిందన్నారు. ఈ ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తయితే నాలుగు నియోజకవర్గాల్లో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అంది రైతులు బాగుపడతారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రెండు ఎత్తిపోతల పనులు పూర్తి చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఆయకట్టు ప్రాంతాల్లో రైతులతో కలిసి బీఆర్ఎస్ త్వరలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్య ప్రజాప్రతినిధులు సాగునీటి పోరాటం అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని హరీశ్‌రావు సూచించారు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, సంగారెడ్డి ప్రాంత రైతులు, ప్రజలు, పార్టీ క్యాడర్‌ను సాగునీటి పోరాటంలో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి , కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

పచ్చని పల్లెల్లో కుంపటి పెడతారా

బలవంతంగా డంప్‌యార్డు ఏర్పాటు చేయడం తగదు

- గుమ్మడిదలను మరో లగచర్లగా మార్చుతారా..
- పోలీసులను పంపి.. ప్రజలను భయపెట్టి పనులు చేయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- డంప్‌యార్డు ఏర్పాటైతే ఇక్కడి ఎవుసం దెబ్బతింటది
- పర్యాటకం, పర్యావరణ పరంగా ఈ ప్రాంతానికి తీవ్ర నష్టం
- హైకోర్టు ఆదేశాలను కలెక్టర్ అమలు చేయాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- గుమ్మడిదల దీక్షకు సంఘీభావం



గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, మాణిక్‌రావు, చింతాప్రభాకర్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

గుమ్మడిదల, ఫిబ్రవరి14: పచ్చని పంటలు, చెరువులు, పర్యాటకానికి నెలవైన గుమ్మడిదలలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటుతో ప్రభుత్వం ఈ ప్రాంతంలో కుంపటి పెట్టాలని చూస్తున్నదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్యారానగర్ డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా గుమ్మడిదలలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం 4వ రోజుకు చేరుకుంది. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, డీసీసీబీ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు నిర్మాణానికి పదిరోజుల క్రితం మంగళవారం అర్ధరాత్రి పోలీసు బలగాలను గ్రామాలకు పంపి నాయకులను బలవంతంగా అరెస్ట్ చేసి సంగారెడ్డికి తరలించి తమది ఎమర్జెన్సీ పాలన అని కాంగ్రెస్ మరోసారి నిరూపించిందని ఆరోపించారు. ఆ రాత్రి మహిళలు నిద్రలేకుండా భయభ్రాంతులతో కాలం గడిపితే, జీహెచ్ఎంసీ అధికారులు వందల సంఖ్యలో టిప్పర్లతో డంపింగ్‌యార్డు పనులు రాత్రికి రాత్రే చేయడం వెనుక మతలబు ఏమిటీ అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ ప్రాంత రైతులు బంగారు పంటలు పండిస్తున్నారని, డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి వారి భూములు సాగుకు పనికి రాకుండా చేసి మరో లగచర్లగా మార్చవద్దని ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు. డంపింగ్‌యార్డుకు దిగువ ప్రాంతంలో ఉన్న నర్సాపూర్ రాయచెరువు పర్యాటకానికి చిరునామా అని, ఇది పూర్తిగా కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. మత్స్యకారుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయన్నారు. దుండిగల్ ఎయిర్‌పోర్స్ అకాడమీకి ఇబ్బందులు తప్పవన్నారు. దీనిపై ఇప్పటికే రైతు జేఏసీ నాయకులు అకాడమీ కమాండర్‌కు వినతి పత్రాన్ని అందజేశారని గుర్తుచేశారు. కమాండర్ కలెక్టర్‌కు, తమ పైఅధికారులకు సైతం లెటర్లు పంపినట్లు చెప్పారు. డంపింగ్‌యార్డు పనులు నిలిపి వేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసినా ప్రధాన గేటు, రోడ్డు పనులు చేపడుతున్నారని, దీనికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ బాధ్యులు అవుతారని హరీశ్‌రావు సూచించారు. అసెంబ్లీ వేదికగా ఈ సమస్యపై పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల నిర్ణయాన్ని గౌరవించి డంపింగ్‌యార్డు ఏర్పాటును తక్షణమే రద్దు చేయాలని, లేదంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రామచంద్రాపురం సీనియర్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, కొలను బాల్‌రెడ్డి, జి.వెంకటేశంగౌడ్, రాజేశ్, చంద్రాగౌడ్, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్, యావన్నగారి సంతోష్‌రెడ్డి, చిమ్ముల నర్సింహరెడ్డి, రాజశేఖర్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోర్టు నిబంధనలు పాటించాలి..

జీహెచ్ఎంసీ పరిధిలోనే డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయాలన్న కోర్టు నిబంధనలు కాంగ్రెస్ సర్కారు తెలియవా. కోర్టు నిబంధనలకు విరుద్ధంగా ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడంతో ఇక్కడి భూములు, గాలి కలుషితం అవుతాయి. ఎవుసం దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లుతుంది. ఈ ప్రాంతం పూర్తిగా కలుషితమవుతుంది. దిగువ ప్రాంతంలోని నర్సాపూర్ రాయచెరువు పూర్తిగా కలుషితం అయ్యే ప్రమాదం ఉంది. దిగువభాగంలోని చెరువులు, కుంటలు కలుషితం అవుతాయి. వేల మంది రైతుల బతుకులు ఆగమైతాయి. పది రోజులుగా వినూత్నంగా నిరసనలు చేయడం అభినందనీయం. ప్రజల నిర్ణయాన్ని గౌరవించి ప్రభుత్వం డంపింగ్‌యార్డు ఏర్పాటు పనులను ఆపాలి. –సునీతాలక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

ఇది ప్రజా పాలననేనా..

ఇది ప్రజాపాలన కాదు. ప్రజలను హింసించే పాలన. మా ప్రాంతంలో 2 వేల ఎకరాల్లో రైతులను భూములు గుంజుకోవాలని ప్రయత్నిస్తే హరీశ్‌రావు చొరవతో మాకు న్యాయం జరిగింది. లగచర్లలో రైతుల భూములను గుంజుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు బేడీలు వేసి హింసించిన ఘనత రేవంత్ సర్కారుకు దక్కింది. ఎక్కడ చూసినా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటుతో ఇబ్బందులు వస్తాయని నిరసనలు చేస్తుంటే ఇప్పటి వరకు సీఎం స్పందించకపోవడం దారుణం. వెంటనే డంపింగ్‌యార్డు పనులు నిలిపి వేచాలి. లేకపోతే మరో లగచర్ల పోరాటాన్ని చూడాల్సి వస్తది. – మాణిక్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే

సిద్దిపేటలో బస్టాండ్‌లో బస్సులోకి తోసుకొని ఎక్కుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

సర్కారు బస్సు.. సర్కస్ ఫీట్

మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఉచిత ప్రయాణం కావడంతో మహిళలు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణిస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరిపడా బస్సులు లేకపోవడంతో బస్సులో సీట్లు దొరుకుతాయో, దొరకవు అనే ఆత్రుతతో బస్టాండ్‌ల్లో బస్సు రాగానే ఎక్కేందుకు ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో గొడవలు చోటుచేసుకుంటున్నాయి. బస్సుల్లో రద్దీతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫుట్‌బోర్డు మీద ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తున్నది. బస్సుకు వేళాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. బస్సుల కోసం ఎదురుచూసి చూసి వచ్చిన బస్సులో సీట్లు దొరకకపోయినా ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. చిన్నపిల్లలతో ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే పెద్ద సాహసమే చేయాలి అన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయి.

–నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్
సిద్దిపేట, ఫిబ్రవరి 14

సిద్దిపేటలో బస్సు ఎక్కేందుకు పాట్లు పడుతున్న విద్యార్థులు

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

చేర్యాల ఎస్సీ గురుకుల పాఠశాల స్టోర్స్‌లో పప్పును పరిశీలిస్తున్న కలెక్టర్

చేర్యాల, ఫిబ్రవరి 14: గురుకులంలో డైట్ చార్జీల ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు వడ్డించాలని కలెక్టర్ ఎం.మను చౌదరి ప్రిన్సిపాల్ పుల్లయ్యకు సూచించారు. శుక్రవారం చేర్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్ హాల్, స్టోర్ రూమ్, డైనింగ్ హాలును పరిశీలించారు. పదో తరగతిలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వివరాలు తెలుసుకున్నారు. గురుకులంలో ప్రహరీ మరమ్మతులు, డార్మెటరీలో కిటికీల రిపేర్లు, స్టీమ్డ్ యూనిట్‌కు ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీర్ల ద్వారా ప్రతిపాదనలు తనకు పంపించాలని ఆదేశించారు. అనంతరం ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఏఎన్‌సీ, ఈడీడీ, ఓపీ, సిబ్బంది హాజరు, ఆరోగ్య మహిళ తదితర రిజిస్టర్లు పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. చేర్యాల తహసీల్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్ సందర్శించి వసతులు ఆరాతీశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్, ఎండీవో మహబూబ్ ఆలీ, పీహెచ్‌సీ ఉద్యోగులు, వసతిగృహ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కేసీఆర్‌కు కానుకగా మొక్కలు నాటాలి

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



వృక్షార్చన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, చెప్యాల రాజేశ్వర్

గజ్వేల్, ఫిబ్రవరి 14: బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 17న ప్రతిఒక్కరూ మొక్కలు నాటి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెప్యాల రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో వృక్షార్చన గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడుతూ.. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా గ్రీన్ ఇండియా చాలెంజ్ సృష్టికర్త జోగినపల్లి సంతోష్‌కుమార్ నిర్వహించే వృక్షార్చనలో గ్రామాల్లోని యువత పాల్గొనాలన్నారు. ప్రతిఒక్కరూ మూడు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను వారే తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చేపట్టిన హరితహారంలో కోట్లాది మొక్కలు నాటడంతో నేడు తెలంగాణలో పచ్చదనం పెరిగిందన్నారు. అడవుల విస్తీర్ణం పెరగడంలో కేసీఆర్ కృషి ఎంతో ఉందని ఆయన గుర్తుచేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు జఫర్‌ఖాన్, గుంటుక రాజు, ఉపేందర్ రెడ్డి, ఉమార్, ఆకుల దేవేందర్, కనకయ్య, భాస్కర్, సురేశ్, సినీ నటుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి భోజనమే దిక్కు

- చండూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అవస్థలు

చండూర్ పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చిన భోజనం బాక్సులు చూపుతున్న విద్యార్థులు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 14 : మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చండూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, తాగునీటికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో 58 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుండక పోవడంతో కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని తింటున్నారు. పాఠశాలలో నీటి సమస్య ఉండడంతో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగునీరు అందించడంలో అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు సతీశ్‌ను వివరణ కోరగా.. పాఠశాలలో పెడుతున్న భోజనం మంచిగా ఉండడం లేదని కొంతమంది విద్యార్థులు భోజనం, తాగునీరు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నది వాస్తమేనని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మెనూ ప్రకారం రుచికరమైన, నాణ్యమైన మధ్యాహ్నం భోజనం అందించడంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- రేవంత్ సర్కార్‌కు పట్టని ప్రజల ఆందోళనలు
- డంప్‌యార్డు ఎత్తివేయాలని 11 రోజులుగా కొనసాగుతున్న నిరసనలు
- బిగిరాని కాంగ్రెస్ సర్కారు
- దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ లేఖకు ఇంకా జవాబు ఇవ్వని సంగారెడ్డి కలెక్టర్
- హైకోర్టు, ఎన్‌జీటీని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్న జేఏసీ

సర్కారు సై.. ప్రజలు నై..!

పార్యానగర్‌లో జీహెచ్ఎంసీ డంప్‌యార్డు నిర్మాణానికే ప్రభుత్వం మొగ్గు

శుక్రవారం గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): ప్రజా ఆందోళనలు రేవంత్ సర్కారుకు పట్టడం లేదు. పార్యానగర్‌లో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటును నిరసిస్తూ 11 రోజులుగా గుమ్మడిదల మండలం ప్రజలంతా జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతున్నారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, అన్నిపార్టీలు, అన్నివర్గాలు ఏకమై ముక్తకంఠంతో డంప్‌యార్డు వద్దంటూ నిరసనలు తెలుపుతున్నారు. ప్రతిరోజు వినూత్నంగా నిరసనలు తెలుపుతూ డంప్‌యార్డు నిర్మాణాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కానీ, ప్రభుత్వం దీనిపై వెనకడుగు వేయడం లేదు. కనీసం స్పందించడం లేదు. ప్రజాపాలన అంటూ గొప్పలు చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి డంపింగ్‌యార్డు ఆందోళనలు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి వరకు డంప్‌యార్డుపై అధికారికంగా స్పందించలేదు. ప్రజలు ఆందోళనలు తీవ్రం చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పనులు ఆపడం లేదు. డంప్‌యార్డు విషయంలో వెనక్కి తగ్గితే తమ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని ప్రభుత్వం లోని పెద్దలు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ మొదటి నుంచి ప్యారానగర్‌లో డంప్ యార్డును వ్యతిరేకించడమే కాకుండా ప్రజలతో కలిసి ఆందోళన చేస్తున్నది. ప్యారానగర్‌లో డంప్‌యార్డు నిర్మాణం పనులు ప్రారంభించింది మొదలు 10 రోజులుగా బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేస్తున్నారు. జేఏసీ నాయకులతో పాటు ప్రజలను కలుపుకొని బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనతో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు పటాన్‌చెరు బీఆర్ఎస్ నాయకులు, గుమ్మడిదల మండల బీఆర్ఎస్ నాయకులు డంప్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు.

హైకోర్టు, ఎన్‌జీటీ ఆశ్రయించాలని నిర్ణయం

డంప్‌యార్డు నిర్మాణంపై రైతులు హైకోర్టును ఆశ్రయించగా సర్వే చేయాలని కోర్టు సూచించింది. దీంతో సర్వే పనులు కొనసాగుతున్నాయి. సర్వే ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ అధికారులు డంప్‌యార్డు పనులు తిరిగి మొదలుపెట్టే అవకాశాలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో డంప్‌యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేసేందుకు బీఆర్ఎస్, జేఏసీ నాయకులు సన్నద్ధవుతున్నారు. డంప్‌యార్డుకు వ్యతిరేకంగా హైకోర్టును ఆశ్రయించనున్నారు. సోమవారం హైకోర్టులో బీఆర్ఎస్, జేఏసీ నాయకులు కేసు వేసే అవకాశాలు ఉన్నాయి. త్వరలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించనున్నారు. న్యాయస్థానంలో తమకు న్యాయం జరుగుతుందని జేఏసీ నాయకులు ధీమాతో ఉన్నారు. డంప్‌యార్డు ఏర్పాటుతో ప్యారానగర్, కొత్తపల్లి గ్రామవాసులతో పాటు గుమ్మడిదల ప్రజలకు జరిగే నష్టాలను కోర్టుకు వివరించి న్యాయం చేయాలని కోరుతామని జేఏసీ నాయకులు చెబుతున్నారు.

ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధ్యయనం...

పార్యానగర్‌లో డంప్‌యార్డు ఏర్పాటును దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ ట్రైనింగ్ అకాడమీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. డంప్‌యార్డు నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని అకాడమీ వింగ్ కమాండ్ శుభమ్ మిశ్రా ఇటీవల సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. డంప్‌యార్డు ఏర్పాటు కారణంగా పక్షుల సంచారం పెరిగి ఎయిర్‌ఫోర్స్ శిక్షణకు ఆటంకం కలగడంతో పాటు శిక్షణ పైలెట్ల ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని తన లేఖలో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఈ లేఖపై ఇంకా అధికారికంగా స్పందించలేదు. లేఖపై కలెక్టర్ వల్లూరు క్రాంతి జీహెచ్ఎంసీ అధికారులతో చర్చిస్తున్నట్లు సమాచారం. డంప్‌యార్డు ఏర్పాటును నిలిపివేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు బెంగళూరు, ఢిల్లీలోని ఉన్నతాధికారులకు లేఖలు రాసినట్లు తెలుస్తుంది. డంప్‌యార్డు ఏర్పాటుతో చోటుచేసుకునే ప్రమాదాలు, నష్టాలపై దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ సొంతంగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం.

రైల్వేలైన్ పనులను అడ్డుకున్న రైతులు

- రైల్వేలైన్ నిర్మాణ పనులతో భూములు కోల్పోయాం
- ఇప్పటి వరకు పరిహారం అందలేదు: రైతులు

గంగాపూర్‌లో రైల్వేలైన్ పనులను అడ్డుకున్న బాధిత రైతులు

చిన్నకోడూరు (సిద్దిపేట), ఫిబ్రవరి 14: తమకు నష్టపరిహారం చెల్లించాకే రైల్వేలైన్ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని గంగాపూర్ బాధిత రైతులు శుక్రవారం పనులను అడ్డుకుని ధర్నా చేపట్టారు. తమ పట్టా భూములు రైల్వేలైన్ నిర్మాణ పనుల్లో కోల్పోయామని, ఇప్పటి వరకు తమకు నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగి వేసారిపోతున్నామని, అయినా పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై బాలకృష్ణ అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. తహసీల్దార్‌కు ఫోన్ ద్వారా సమస్య వివరించగా, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ధర్నాలో బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు గుండెల్లి వేణు, రైతులు పాల్గొన్నారు.